

# అమెరి'కలకలం' కథలు

– వంగూరి చిట్టెన్ రాజు



## 17

# నోటా - నోటమట్టా ?

మన భారత దేశం ఎన్నికల సంఘం వాళ్ళు అమెరికా వాళ్ళ కంటే చాలా తెలివైన వాళ్ళు అని మొన్న రాత్రే నాకు తెలిసిపోయింది. ఎందు కంటే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలలో వారు అందరికీ ఓటు వెయ్యడానికి మూడు కేటగిరీలు మాత్రమే ఇచ్చారు. అందులో మొదటి కేటగిరీ వాళ్ళు "పొడిచేసే వాళ్ళు". రెండో కేటగిరీ వాళ్ళు "సన్నాసులు". ఈ రెండు కేటగిరీలలోనూ అభ్యర్ధులు ఎంత మంది ఉన్నా, ఏ ఒక్కరికి ఓటు వేసినా అంతిమంగా ఎన్నుకునేది వెన్నుపోటు పొడిచే వాడినో, లేక సన్నాసినో అనే దాంట్లో అనుమానం ఏమీ లేదు. ఇక ఆ మూడోది ఇది వరకూ ఏ ఎన్నికలలోనూ లేని "నోటా" అనే కేటగిరీ. అంటే ఓటరు మహాశయుడికి ఏ ఒక్క పొడిచే వాడు కానీ, సన్నాసి కానీ నచ్చక పోతే అప్పుడు ఈ "నోటా" బటన్ నొక్కేసి ఇంటికెళ్ళి పోయి, ఎలక్షన్ రిజల్ట్స్ టీవీలో చూసుకోవచ్చును అనమాట. "నోట మట్టి" అనే మాటకి ఎన్నికల సంఘం వారు టూకీగా, తెలివిగా "నోటా" అనే మాట వాడారూ అని నాకు అర్ధం అయిపోయింది.

"నీ మొహం, ఎన్నికలలో నుంచున్న వాళ్ళు అందరూ అలాంటి వాళ్ళే అంటావా ఏమిటీ? అని మా క్వీన్ విక్టోరియా నన్ను నిలదీసింది. "నేను కాదు అంటుంట. వాళ్ళంతట వాళ్ళే అలా చెప్పుకుంటున్నారు." అని నేను కొంచెం వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. ఉదాహరణకి కేసీఆర్ గారు "టీ ఆర్ ఎస్సోళ్ళు తప్ప ఎలెక్షన్స్ లో నించున్నోళ్ళు అందరూ సన్నాసులే. అందులో ఆడు ఆంధ్రోడయితే డబుల్ సన్నాసి. మొన్న జూడలే ..ఆడెవడూ...అదెక్కడో గుజరాతు నించి వచ్చి మన తెలంగాణా గడ్డ మీద పొద్దున్న ఇద్దరు ఆంధ్రా సన్నాసులని సెరో పక్కనా కూసో పెట్టుకోలే" అని మొన్న పొద్దున్న కరీంనగర్ లో మొదలు పెట్టి సాయంత్రం ఖైరతాబాద్ సభ దాకా

ఇరవై సభలలో నాకు కూడా అర్థఅయ్యే భాషలో చాలా మంది అభ్యర్థులు “సన్నాసులు” అని చెప్పారు. అలాంటి లోపాయికారీ వ్యక్తిగత వివరాలు ఆయనకీ కాక మన లాంటి సాధారణ మానవులకి ఎలా తెలుస్తుందీ?

అటు ఆంధ్రా వేపు పోతే మరొక రకమైన సీను, ఒకే రకమైన డైలాగులు పదే, పదే వినపడుతూ ఉంటాయి. అదే జగనన్న “మామనే వెన్ను పోటు పొడిచిన” చంద్రబాబు పార్టీ తెలుగు దేశం అభ్యర్థులూ, వైఎస్సార్ పోగానే తనని సీఎం చెయ్యకుండానూ, చెప్పు పెట్టకుండా రాష్ట్రాన్ని విభజించేసిన కాంగెస్ పార్టీ అభ్యర్థులూ వెరసి మొత్తం ప్రత్యర్థులంతా “పొడిచేసే వారు” అనీ, అందు వలన వారిని ఎన్నుకుంటే ఆ తరువాత అలవాటు కొద్దీ ప్రజలకే వెన్నుపోటు పొడుస్తారనే జగనన్న కుటుంబసమేతంగా ఏడుస్తారు. ఈ హడావుడి మధ్యలో గబ్బర్ సింగుడు రంగ ప్రవేశం చేసి ఇప్పటికే సగం మునిగిన చిరంజీవి కొంపని సముద్రం లో కూలి పోయిన మలేషియా విమానం లాగ ఆచూకీ తెలియకుండా చేశాడు. ఈయన “కెవ్వు కేక” లు వేరు. అంటే..కేకలూ, రంకెలే కానీ ఈయనగారి తిక్కకి అసలు లెక్క ఉందా, లేదా తెలిసి చావడం లేదు. కాస్తో, కూస్తో అర్థం అయిందల్లా “మా అన్న పార్టీకి వేస్తే చంపేస్తాను. మోదీకి వేస్తే ఒదిలేస్తాను.” ఎన్నికలలో నిలబడడం లేదు కాబట్టి ఈయన “సన్నాసి” కేటగిరీ యా లేక “పొడిచేసే చేసే” కేటగిరీయా అనేది మనకి తెలియక్కర లేదు.

ఈ స్థానిక జోకర్లు చాలరేమో అన్నట్టు అప్పుడప్పుడు “మొద్దబ్బాయి”, “బలి దేవత”, “మౌన ముని”, మొదలైన జాతీయ జోకర్ల లో కొందరు ఆంధ్రా వేపు వెళ్ళడానికి దమ్ములేక, తెలంగాణా వచ్చి జైరాం రమేష్ రాసిచ్చిన ఆవు వ్యాసం లాంటిది చదివేసి, “నమో వాగుడు కాయ” లాంటి వారు వెంకయ్య వాక్కుని వల్లె వేసి తెలుగు ప్రజలని ఎన్నికలకి సిద్ధం చేస్తున్నారు అనే కంటే విముఖం చేస్తున్నారు అని చెప్పుకోవచ్చును.

ఇక అన్నింటికన్నా దౌర్భాగ్యం మన టీవీ చానెల్ వాళ్ళ ఎన్నికల కవరేజ్. ఈ న్యూస్ రిపోర్టర్లు అసలే అంతంత మాత్రం. వీరి భాష, రాజకీయ వేత్తల భాష వింటే తెలుగు భాష మీద జాలి, ఇంగ్లీషు మీద విరక్తీ కలుగుతాయి. మంచి భాష రాకపోతే పోనీ లే అనుకో వచ్చును కానీ వీళ్ళలో కొంత మంది కొన్ని అక్షరాలు కూడా సరిగ్గా పలక లేరు. ఇక్కడో సంగతి గుర్తుకొస్తొంది. చాలా మంది గుజరాతీ వారి లాగే ఈయనకీ “ష” అనే అక్షరం, “శ” అనే అక్షరమూ పలకవు. ఉదాహరణకి “రాకేష్” అనే బదులు “రాకేస్” అంటారు. అలాగే “సుష్మా” బదులు “సుస్మా” అనే అంటారు. ఇదెందుకు గుర్తుకొచ్చిందీ అంటే ...మొన్న రాత్రి నేనూ, మా క్వీన్ విక్టోరియా మన ఎలెక్షన్ల కవరేజ్ చూద్దామని టీవీ పెట్టి చూస్తున్నాం. కొంచెం వగలు పోతూ “కెమెరామన్ చచ్చా తో” ఒక న్యూస్ రిపోర్టమ్మ స్థానిక వివరాలు చెప్తోంది. అది వినగానే మా ఆవిడ “ఛ, ఛ, ఇలాంటి వాళ్ళని ఎలా పెట్టుకుంటారో ఈ టీవీ వాళ్ళు” అని మొహం అదోలా పెట్టింది”. ఆ అమ్మాయి చెప్తున్న వార్త ఏమిటంటే” ఇక్కడ స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే గారు నెగ్గే అవకాశాలు లేవు”.

మేము గమనించిన విషయం ఏమిటంటే గుజరాతీ వారు “ష” బదులు “స” ఎలా పలుకు తారో ఈ అమ్మాయి దానికి ఆపోజిట్ గా “సి” బదులు “షి” అని మహానందంగా అటు తెలుగునీ, ఇంగ్లీషునీ కూడా ఖూనీ చేసి పారేస్తోంది.

ఏది ఏమైతేనేం, ఈ సారి “మంద భాగ్యులు”, నోట్లకి అమ్ముడు పోయిన వారూ, తమ కులంవారిని నెగ్గించుకుని బావుకుందామనుకునే వాళ్ళూ తమ అభిమాన “సన్నాసి“ కో, “పొడిచేవాడికో” ఓటు వేసినా, మధ్య తరగతి వారిలో చాలా మంది ఈ సారి “నోటా” బటనే నొక్కి ఎవరికీ ఓటు వెయ్యరు అన్నాను మా క్వీన్ విక్టోరియాతో.

“అసలు ఈ ఎలెక్షన్ కమిషన్ వాళ్లకి బుర్ర లేదు” అంది మా క్వీన్ విక్టోరియా హఠాత్తుగా.

“అదేం, అంత మాట అనేశావ్? వాళ్ళు విన్నారంటే బావుండదు” అన్నాను భయం, భయంగా చుట్టూ చూస్తూనూ.

“అసలు ఈ నోటా” ఆలోచన బాగానే ఉన్నా, చచ్చీ చెడి పోలింగ్ బూత్ దాకా వెళ్లి “ఈ అభ్యర్థులలో నాకు ఎవరూ నచ్చ లేదు” అనే “నోటా” బటన్ ఎవరు నొక్కుతారోయ్ వెర్రి మొహమా? ఎవరూ నచ్చక పోతే అసలు అక్కడికి వెళ్ళనే వెళ్లరు కదా! హాయిగా ఇంట్లో కూచుని టీవీ రిమోట్ బటన్ నొక్కు కుంటారు ” అంది క్వీన్ విక్టోరియా.

ఈ ఎన్నికల తరువాత కూడా ఇటు రాష్ట్రం లోనూ, అటు దేశం మొత్తం మీదా ఏ పార్టీ నెగ్గినా జనం నోట మట్టి కొట్టి నోట్లు కొల్లగొట్టుకోవడమే కదా జరిగేది అనే అనిపిస్తోంది. ఏమంటారు?

**COMMENTS**